గణపతికి ఘన పూజలు



గణేశ్ పూజల్లో పాల్గొన్న జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి

వినాయక చవితి ఉత్సవాలు చివరి దశకు చేరుకోవడంతో విగ్రహాల నిమజ్జనాలు జోరందుకున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో ఏర్పాటు చేసిన మండపాల్లో బుధవారం గణనాథులకు విశేష పూజలు నిర్వహించి నిమజ్జనాలకు తరలించారు. ఈ సందర్భంగా గణేశ్ లడ్డూల వేలం పాట నిర్వహించి అన్నదానాలు తదనంతరం ఊరేగింపుగా డప్పు చప్పుళ్ల మధ్య వినాయకులను నిమజ్జన ఘాట్‌లకు తరలించారు. – కుత్బుల్లాపూర్



దుండిగల్ తాండాలో పూజల్లో పాల్గొన్న బీజేపీ నేత మల్లారెడ్డి



గ్రాన్యూల్స్ ఇండియా పరిశ్రమలో మండపం వద్ద అన్నదానం



వల్లభాయ్‌పటేల్‌నగర్‌లో.. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



జగద్గిరిగుట్టలో అన్నదానంలో పాల్గొన్న కార్పొరేటర్ జగన్



మైసమ్మనగర్‌–బీలో కమిటీ కోశాధికారి సంతోష్ ఆధ్వర్యంలో..



వినాయక పూజల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి



అయోధ్యనగర్‌లో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ మండపంలో భక్తులు



రూ.4 లక్షలకు లడ్డూను దక్కించుకున్న వెంకట్‌రెడ్డికి అందజేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

డేటా సైన్స్‌పై అంతర్జాతీయ సదస్సు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ వీజే ఐఈటీ కళాశాలలో బుధవారం డేటా సైన్స్‌పై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఆన్‌లైన్ వేదికగా జరిగిన ఈ సదస్సులో డెన్మార్క్, యూఎస్‌ఏలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఐఐఐటీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సెంటర్‌కు నేతృత్వం వహిస్తున్న డాక్టర్ వై.రఘుబాబురెడ్డి, సేల్స్‌ఫోర్ సంస్థ యూనివర్శిటీ ప్రోగ్రామ్ మేనేజర్ సంతోష్ రెబెల్లో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

◆ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో వస్తున్న అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ అనుసంధానం ద్వారా కలిగే సదుపాయాలను వివరిస్తూ, కంప్యూటర్లు, సమాచార వ్యవస్థలను ప్రభావంతంగా వాడితే మెరుగైన ఉత్పాదకత సాధ్యపడుతుందని వివరించారు. అదే విధంగా డేటా సైన్స్ ప్రాముఖ్యత, నేటి అవసరాలకు అనుగుణంగా శక్తివంతమైన కంప్యూటర్ వ్యవస్థ, వాటితో కలిగే ప్రయోజనాలను క్లుప్తంగా విశదీకరించారు. ఈ సదస్సులో సీఎస్‌ఈ విభాగం అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సేవా నంది పురస్కారం

జగద్గిరిగుట్ట: ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వారికోత్సవం సందర్భంగా కిమ్స్, సన్‌షైన్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో సేవా నంది జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన దుర్గమ్మకు సేవా నంది పురస్కారం లభించింది. దుర్గమ్మకు ఈ పురస్కారం రావడం ఆమె కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

'నాపై అసత్య ప్రచారంతో నన్ను సస్పెండ్ చేశారు'

చింతల్: ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి గొల్ల జాన్‌పై ఉన్న సస్పెన్షన్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎత్తివేసింది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గొల్లజాన్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఎన్‌ఎస్‌యుఐలో పని చేస్తూ విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తు వస్తున్నానని, తనకు వస్తున్న గుర్తింపును చూసి ఓర్వలేక అసత్య ప్రచారం చేయడంతో తనను సస్పెండ్ చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువని, అందుకే తనపై ఆరోపణలు నిరాధారమైనవి గుర్తించి అధిష్టానం సస్పెన్షన్ ఎత్తి వేసిందన్నారు.

వొకేషనల్ కళాశాలను సందర్శించిన విద్యాధికారి



కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి

సుభాష్‌నగర్: మేడ్చల్ జిల్లా ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ అధికారి బుధవారం బహదూర్‌పల్లి చౌరస్తాలోని కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ వొకేషనల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమైన ఆయన సదుపాయాలపై ఆరాతీశారు. ప్రభుత్వం వొకేషనల్ విద్యా విధానంతో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు మెరుగపరిచే దిశగా కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ షేక మైమూన్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

విరిగిన చెట్లు.. నిలిచిన నీళ్లు



కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జీడిమెట్ల డివిజన్ స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీలో ప్రధాన రోడ్డుపై చెట్టు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో భారీగా వరద నీరు వచ్చి చేరింది. అదే విధంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రగతినగర్ ప్రధాన రహదారుల్లో వరదనీరు చేరడంతో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రాష్ట్రాభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యం



ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆలింగనం చేసుకుంటున్న వృద్ధుడు



ఎమ్మెల్యే వివేకానంధ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దుండిగల్ గ్రామస్తులు

కుత్బుల్లాపూర్: రాష్ట్రాభివృద్ధి బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమని, పదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం చింతల్, జగద్గిరిగుట్ట డివిజన్ల పరిధిలో బుధవారం ప్రగతియాత్ర చేపట్టిన ఆయన రూ.7 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

◆ చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో రూ.59 లక్షలు, ఎస్‌ఎల్‌బీనగర్‌లో రూ.45 లక్షలు, ఆర్‌ఎంనగర్‌లో రూ.49 లక్షలు, వల్లబాయ్ పటేల్‌నగర్‌లో రూ.49.5 లక్షలు, ఆర్‌ఎంనగర్‌లో ఈద్గా రోడ్డులో రూ.47.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

◆ జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీలో రూ.98లక్షలు, రాజీవ్‌గృహకల్పలో రూ.48లక్షలు, షిర్డీహిల్స్–బిలో రూ.25 లక్షలు, అంజయ్యనగర్‌లో రూ.48 లక్షలు, సంజయ్‌పురికాలనీలో రూ.47 లక్షలతో సీసీ రోడ్డు పనులు, హిర్డీహిల్స్–బిలో రూ.21.5 లక్షలు, షిర్డీహిల్స్–ఏలో రూ.31 లక్షలు, అంజయ్యనగర్‌లో రూ.47 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.

◆ ఆయన మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ సహకారంతో అభివృద్ధి పనులు నిధుల లేమి లేకుండా వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రాభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

◆ ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు మక్సూద్ అలీ, బసవరాజు, వెంకటేశ్‌గౌడ్, శేఖర్‌రావు, అశోక్, వహీద్ ఖురేషీ, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, వెంకటేశ్వరస్వామి, ఆలయ చైర్మన్ వేణుయాదవ్, రషీద్ తదితరలు పాల్గొన్నారు.

డ్రైనేజీ, సీసీ రోడ్లను చేయాలి

కుత్బుల్లాపూర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లను చేయాలని గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ, రోడ్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొనగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజును కలిసి దూలపల్లి గౌడ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ పెద్దపీట వేసి సంక్షేమ పథకాలను అమలు పరుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీకి సమస్యలను నివేదించగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

◆ దూలపల్లికి చెందిన గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. గౌడ సంఘం భవన నిర్మాణానికి సహకరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ డప్పు కిరణ్, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని బయటకు తీసుకొస్తున్నాం

జీడిమెట్ల: సెమ్స్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్టులో టీవీఆర్ పాఠశాలలు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం పట్ల పాఠశాల అకడమిక్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. సెమ్స్ ఒలింపియాడ్ ఎంట్రన్స్‌లో టీవీఆర్ పాఠశాలకు చెందిన మొత్తం 28మంది విద్యార్థులు జాతీయ ర్యాంకులు సాధించారు. వీరికి ఈనెల 17వ తేదీన హైటెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు అవార్డులు అందజేశారు.

◆ బుధవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి వంశీకృష్ణారెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సాధన చేయిస్తున్నామని చెప్పారు.



అవార్డులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి

పోటీ పరీక్షలు విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని బయటకు తీసుకొస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రికెట్ జట్టుకు వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఆర్థికసాయం

నిజాంపేట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దివ్యాంగుల క్రికెట్ జట్టుకు వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ సభ్యులు రూ.1,12,116 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బుధవారం అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జట్టు సభ్యులకు శంషాబాద్ విమానాశ్రమంలో వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ప్రెసిడెంట్ పోసింరెడ్డి సునీల్, కో.ఆర్డినేటర్ తిరుపతిరావు, కార్యదర్శులు బుడ్డా ధర్మారెడ్డి, అంజిరెడ్డిలు నగదును అందజేసి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. అంతర్జాతీయస్థాయిలో రాష్ట్రానికి పేరు తీసుకురావాలని అభిలాషించారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ సభ్యులు

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

ఉరేసుకునే ముందు సెల్ఫీ వీడియో

నిజాంపేట్: ఆర్థిక ఇబ్బందుల మూలంగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహేష్(32) ప్రగతినగర్‌లో సంవత్సర కాలంగా భార్య పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇటీవల అప్పులు ఎక్కువై ఇబ్బందులు పడుతున్న మహేష్ డిప్రెషన్‌లోకి వెళ్లాడు. మంగళవారం భార్యాపిల్లల తమ పుట్టింటికి వెళ్లారు.

– ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి తర్వాత మహేష్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఎన్ని సార్లు ఫోన్ చేసిన స్పందించలేదు. ఎదురింట్లో ఉండే బంధువులకు ఫోన్ చేసి ఇంట్లో చూడమని చెప్పగా వారు వెళ్లి తలుపు తీసి చూడగానే మహేష్ ఉరేసుకుని మృతి చెందినట్లు గమనించారు. వెంటనే విషయం కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలిపారు. అయితే 'తన చావుకు ఎవరు కారణం కాదని, తాను ఆర్థిక ఇబ్బందులతో చనిపోతున్నానని ఓ సెల్ఫీవీడియో తీసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



కృష్ణవేణి (ఫైల్)

దుండిగల్: కుటుంబ కలహాలతో నేపథ్యంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు గృహిణులు దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట్ జిల్లా భగవాన్‌పల్లికి చెందిన రవి, కృష్ణవేణి(23) భార్యాభర్తలు. కాగా బతుకుదెరువు నిమిత్తం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న వారికి ఒక పాప ఉంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో భర్త ఇంట్లో లేని సమయంలో కృష్ణవేణి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనం చేసే సమయంలో తెగిన క్రేన్ చెయిన్

కానిస్టేబుళ్లు భక్తులను పక్కకు తప్పించడంతో తప్పిన ప్రమాదం



సుభాష్‌నగర్: గణేష్ నిమజ్జనం కోసం ఘాట్‌ల వద్ద భక్తుల సౌకర్యార్థం ఓవైపు ప్రభుత్వం లక్షలు ఖర్చు పెడుతుంటే... అధికారులు మాత్రం కొన్ని చోట్ల నిర్వహణను గాలికొదిలేశారు. సూరారంలోని కట్ట మైసమ్మ ఆలయం ఎదురుగా ఉన్న లింగా చెరువునే అందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

◆ గణేష్ నిమజ్జనంలో భాగంగా ఓ భారీ వినాయకుని నిమజ్జనం చేసే క్రమంలో క్రేన్ చెయిన్ విరగడంతో ఒక్కసారిగా కింద పడిపోయింది. ఆ సమయంలో ఎవరికి ఏమి కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో భారీ గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా క్రేన్ చెయిన్ తెగిపోయింది.

◆ ఈ క్రమంలో విగ్రహం, చెయిన్ భక్తుల మీద పడిపోతుండగా అక్కడే విధుల్లో ఉన్న జీడిమెట్ల ట్రాఫిక్ కానిస్టేబుల్ రాఘవేంద్ర, వరంగల్ పీటీసీ నుంచి బందోబస్తు కోసం వచ్చిన పోలీస్ కానిస్టేబుళ్లు సుధాకర్, విజయ్ కుమార్ గమనించి క్షణాల్లో ప్రజలను పక్కకి తప్పించారు.

◆ ఒకవేళ అక్కడ పోలీసులు లేకుంటే ప్రమాద తీవ్రత ఊహించలేనిదని ప్రజలు పేర్కొన్నారు. పెను ప్రమాదం నుంచి తప్పించిన ముగ్గురు కానిస్టేబుళ్లను స్థానికులు అభినందించారు.

ఆకట్టుకున్న పద్మశ్రీ కిన్నెర మొగులయ్య ప్రదర్శన



మొగులయ్యను సత్కరిస్తున్న స్ప్రిగ్ విల్లా కమిటీ

నిజాంపేట్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిజాంపేట్ స్ప్రింగ్ విల్లే కాలనీలో బుధవారం పద్మశ్రీ కిన్నెర మొగులయ్య ప్రదర్శన అంగ రంగ వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో తన 12 మెట్ల కిన్నెర వాయిద్యంతో పలు పాటలు ఆలపించిన మొగులయ్య ఆహులతను మంత్రముగ్దులను చేశారు. ప్రధానంగా బీమ్లా నాయక్‌లోని టైటిల్ సాంగ్ ఆలపించగా చిన్నారులు కేరింతలు కొట్టారు. అదే విధంగా శ్రీదేవి కళాబృందం నిర్వహించిన శివ పార్వతుల కల్యాణం బుర్రకథ ఆకట్టుకుంది. మొగులయ్యను కోకా ఇన్నా అధినేత మధుబాబు గండపెండేరంతో సత్కరించారు.

◆ ఈ సందర్భంగా మొగులయ్య మాట్లాడుతూ.. ప్రాచీన కళలు అంతరించిపోతున్న ప్రస్తుతం తరుణంలో కళాకారులను గుర్తించడం.. వారిని సన్మానించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు ఆస్కాని మారుతీసాగర్, బాలకృష్ణ, ఉత్సవ కమిటీ నాయకులు మధుబాబు, వీరస్వామి, గిడుగు రవి కుమార్, సుధీర్, సతీష్, శ్రీనివాస్, సాయి, కృష్ణారావు, స్ప్రింగ్ విల్లా నాయకులు ప్రవీణ్, వెంకటేష్, వెంకటేశ్వర్‌రావు, జక్కుల శ్రీనివాస్, రమ రాజు తదితరులు ఉన్నారు.

పెళ్లైన 10నెలలకే మహిళ ఆత్మహత్య



జ్యోతి (ఫైల్)

దుండిగల్: బాన్సువాడకు చెందిన సంతోష్, బాలానగర్ ఫతేనగర్‌కు చెందిన జ్యోతి((30) లకు పది నెలల క్రితం వివాహం జరిగింది. భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో వారు నివాసముంటున్నారు. సంతోష్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, జ్యోతి బాచుపల్లి వీఎన్‌ఆర్ వీజేఐఈటీ కళాశాలలో సెక్యూరిటీగా పని చేస్తోంది. ఇటీవల భార్యాభర్త మధ్య గొడవలు పరిపాటిగా మారడంతో తీవ్ర మనస్తాపానికి గురైన జ్యోతి బుధవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్ రాడుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల కథ సుఖాంతం

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు
- సెల్‌ఫోన్ వాడొద్దని కట్టడి చేసినందుకే..

జీడిమెట్ల: ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయిన బాలికల కథ సుఖాంతం అయ్యింది. ఎట్టకేలకు జీడిమెట్ల పోలీసులు ఇద్దరు మైనర్ బాలికలను స్టేషన్‌లో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ పవన్, బాలికల బంధువుల వివరాల ప్రకారం .. బుధవారం చింతల్ ప్రాంతానికి చెందిన (13),(14) ఇద్దరు బాలికలు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. కంగారు పడిన తల్లిదండ్రులు ఏమి చేయాలో తోచక జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జీడిమెట్ల పోలీసులు బాలికలు ఇద్దరు విజయవాడ వెళ్తున్నట్లు సీసీ పుటేజీ ఆధారంగా కునుగొని పోలీసులను అప్రమత్తం చేశారు.

విజయవాడకు వెళ్లి.. అటు నుంచి వరంగల్‌కు..

◆ అయితే ఎక్కడికి వెళ్లాలో తోచక అయోమయంలో బాలిక(13) సోషల్ మీడియా స్నేహితుడైన ఓ యువకుడిని ఫోన్ ద్వారా సహాయం అడిగింది. దీంతో సదరు యువకుడు మీరు అక్కడ ఉంటే దొరికిపోతారు. నేను చెప్పినట్లు వింటే ఎవరికి దొరకరని సలహా ఇచ్చాడు. దీంతో యువకుడి సూచనల ప్రకారం ఇద్దరు బాలికలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కి చేరుకుని అక్కడ నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్లో విజయవాడ చేరుకున్నారు. రైల్వే స్టేషన్‌లో దిగిన వెంటనే ఓ ప్రయాణకుడి ఫోన్ ద్వారా సదరు యువకుడికి ఫోన్ చేశారు.



పోలీస్‌స్టేషన్‌లో బాలికలు

◆ అక్కడ నుంచి వరంగల్ రావాలని యువకుడు సూచించాడు. అంతకు ముందు విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని ఇద్దరు బాలికలు దర్శించుకున్నారు. అనంతరం రైల్వేస్టేషన్ చేరుకున్నారు. వారి వద్ద డబ్బులు లేకపోవడంతో ఓ బాలిక వద్ద ఉన్న బంగారు ఉంగరాన్ని రూ.2వేలకు అమ్మేశారు. రైలు ఎక్కి అర్ధరాత్రి వరంగల్ చేరుకున్నారు. ఉదయం వరకు రైల్వేస్టేషన్‌లో పడుకున్నారు.

వరంగల్‌లోని బంధువుల ఇంటికి వెళ్లడంతో...

◆ బుధవారం ఉదయం వరంగల్ బస్‌స్టాండ్ చేరుకుని బాలికల్లో ఒకరి బంధువుకు ఫోన్ చేసి మీ ఇంటికి వస్తున్నామని తెలిపారు. బంధువులు ఇదే విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలియజేశారు. బాలికలు అక్కడ నుంచి వెళ్లిపోకుండా తెలిసిన వ్యక్తి సహాయంతో బాలికలను సురక్షితంగా వరంగల్‌లోని బంధువుల ఇంటికి తీసుకెళ్లారు. బాలికల కుటుంబీకులు బంధువుల ఇంటికి వెళ్లి ఇద్దరు బాలికలను తీసుకుని బుధవారం సాయంత్రం జీడిమెట్ల స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు ఇద్దరు బాలికలను కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

మందలించినందుకే..

పదో తరగతి చదువుతున్న బాలిక(14) తరచూ సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వాడుతూ చదువుపై శ్రద్ధ చూపడం లేదని తల్లిదండ్రులు ఆమెను గట్టిగా మందలించారు. అప్పటి నుంచి సెల్ ఫోన్ సైతం ఇవ్వడం లేదు. సోమవారం రాత్రి అదే విషయంపై తండ్రి బాలిక స్నేహితుల ముందే హెచ్చరించాడు. దీంతో మనస్థాపానికి గురైన బాలిక ఇంటి పక్కనే ఉండే స్నేహితురాలు (13) వద్దకు వెళ్లి విషయం చెప్పి ఏడ్చింది. ఇక్కడ ఉంటే నేను చనిపోతాను ఇక్కడ నుంచి దూరంగా వెళ్లిపోవాలి నాకు తోడు నువ్వు కూడా రావాలని లేదంటే ఆత్మహత్యే శరణ్యమని చెప్పింది. దీంతో చేసేది ఏమి లేక బాలిక (13)సైతం ఇంట్లో ఉన్న రూ.వెయ్యి తీసుకుని ఇంటి నుంచి ఇద్దరు కలిసి ప్లాన్ ప్రకారం బయలుదేరారు.